# రామరాజ్యం

(కథానిక)

వేసవికాలం సాయంత్రం నాలుగు గంటలైనా ఎండవేడి ఇంకా తగ్గలేదు. గోదావరి రైలు స్టేషనునిండా ప్రయాణీకులు కిటకిటలాడుతున్నారు. మూడు గంటలకి రావలసిన రైలుబండి యింకా రాలేదు. స్టేషన బయట సరైన పార్కింగులేక టాక్సీలు, జట్కాలు, ఎద్దుబండ్లు, రిక్షాలు సైకిలు రిక్షాలు తీరు తెన్నులు లేకుండా ప్రయాణీకులకోసం ఎదురు చూస్తూ నిలుచున్నాయి. సానిటేషన్ సరైన పద్ధతుల్లో లేక దుర్వాసన కలిగిస్తోంది. వచ్చేపోయే ప్రయాణీకులకు ఎన్నాళ్ళయినా యీ గోదావరి స్టేషను బాగుపడదా అని విసుక్కుంటూ ప్రయాణీకులు ముక్కు మూసుకుని మరీ స్టేషనుకి చేరుతున్నారు. టిక్కెట్లకోసం ఒకరిమీద ఒకరు ఎగబడుతున్నారు దొమ్ములాడుకుంటున్నారు. టిక్కెట్టుకోసం లోపలికి చేతిని పోనిచ్చి, "ఊపిరాడ్డంలేదు నన్ను బయటికి పోనియ్యండి బాబూ" అంటున్నాడొకాయన. చిల్లరడబ్బులు పోయినాయని గోలపెడుతున్నాడు మరొకాయన క్రింద పడిన తలపాగను పైకి తీస్తూ. ఇంతలో పోలీసొచ్చి తలొకటి లాఠీతో తగిలించాడు. అంతటితో అంతా ఒక నిమిషంలో వరుసలో నిలబడ్డారు. ఈ సంఘటన చూచి "పరాయి వ్యక్తి వచ్చి పెత్తనం చేస్తేనే గాని కుదుటపడే గుణం మనకు లేదుగా" అని అనుకుంటున్నారు కొందరు. తల నెరిసిన తాతలు ఎన్నో పుస్తకాలు కొని మొగాడిలా నడుముకు చేతులు చేర్చి ఇంగ్లీషు పుస్తకాల మొదటి పేజీలపై చిత్రించ బడిన పాశ్చాత్య వనితల అర్ధనగ్న చిత్రాలను చూచి ఆనందిస్తున్నాడొకాయన హిగిన్ బాదమ్ బుక్ స్టాలు వద్ద నిలబడి. వేరుసెనగ, బటానీ చెత్తతో స్టేషనంతా నానా అసహ్యంగావుంది. బండి ఆలస్యానికి విసుక్కుంటున్నారు. కంటికి కనిపించేవన్నీ కొనవలసిందనీ, తాయం తాయం అనీ మారాం చేస్తూ చీర చెంగుల్ని లాగుతూ అల్లరి చేస్తున్న పిల్లల్ని, బండి ఎప్పుడు వస్తుందా అని ఎడమచేతి వేళ్ళని చెక్కిట చేర్చి తదేక ధ్యానంతో ఎదురు చూస్తూన్న తల్లులు, అల్లరి చేస్తే కొడతానని భయపెడుతున్నారు.

సాయంకాలం అయిదున్నర గంటలయింది. ఎవరో ముసలాడొచ్చి గంట వాయించాడు. గేటు వేశారు. సిగ్నల్ యిచ్చారు. అమ్మయ్య! బండివస్తోందని విసుగు చెందిన ప్రయాణీకులు ఒక్కనిట్టూర్పు విడిచారు. ప్లాట్ ఫారం చివరకు వచ్చి, బ్రిడ్జివైపు వంగివంగి చూస్తున్నారు. నల్లటి పొగలతో స్టేషను చేరింది అయిదు ఎభై నిమిషాలకు. ప్రయాణీకుల రద్దీ యెక్కువగా వుంది. బండినుండి బయటకు వస్తూన్న వారిని దిగనీయకుండానే, జనం యెక్కుతున్నారు. బెడ్డింగులు, పెట్టెలు, కిటికీల్లోంచి మనుష్యుల మీదుగా గెంటేస్తున్నారు. "ఇదేమిటయ్యా! కళ్ళు మూసుకుపోయాయా! బుద్ధి లేదా" అనే చీవాట్లు ప్రయాణం హడావిడిలో కొందరు స్వీకరిస్తున్నారు. సహించని కొందరు తిరగబడి "ఏంచేస్తానో చూడు" అని కలబడే పర్యంతం కోపంగా మాట్లాడుకుంటున్నారు. ఈ హడావిడిలో చివరి కంపార్టుమెంటులోంచి అత్తవారింటికి మరదలు పెళ్ళికి వెళ్ళిన భీమరాజు భార్య వరలక్ష్మితో సహా దిగాడు. చిన్న బెడ్డింగు, ట్రంకుపెట్టె పసుపుగుడ్డ కట్టిన బిందె రైల్వే కూలికి అప్పగించి బయటకొచ్చాడు.

ఎభై అరవైయేళ్ళ మధ్య వయస్సు కలిగిన ఒక ముసలితాత తలపాగ సర్దుకుంటూ "బాబూ! బండి కట్టమంటారా" అని యెదురైనాడు.

"ఊ" అని అంగీకారం తెలుపుతూన్నట్లుగా భీమరాజు సిగరెట్టు వెలిగించాడు.

గుమ్మడి శివన్నారాయణ

"ఏవూరెడతారు బాబు."

"కాతేరు. ఎంతిమ్మంటావ్?"

"మీ రిద్దరేనాండి."

"ఆ! మేమిద్దరమే. పైగా ఆ సామాను" రైల్వేకూలి తెస్తూన్న సామాను చూపిస్తూ అన్నాడు భీమరాజు.

"ఒత్తానండి బాబు"

"ఎంతిమ్మంటావు చెప్పు."

"మీదయ"

"కష్టపడే వాడివి నువ్వు మరి నువ్వే చెప్పాలి తాతా."

"ముందీ సామాన్లు బండిలో పెట్టమంటారా" అని రైల్వేకూలీ తొందర పెడుతున్నాడు. భీమరాజు సరేనని, కూలి? డబ్బులిచ్చి పంపించాడు.

"రెండురూపాయలియ్యండి."

"రెండు రూపాయలే! రూపాయి పావలా యిస్తాను."

"అదేమిటండీ? ఆర్యాపురం యెల్లితేనే రూపాయిత్తున్నారు."

"సరే, రూపాయిన్నర"

"ఇంకో పావలా యిప్పించండి."

"రూపాయిన్నర. అంతే."

"బాబూ! మీ దయ. ఎక్కండమ్మా. ఎక్కండి" అని తాత కొడి పైకి లేచిపోకుండా నొక్కి పట్టుకున్నాడు. భీమరాజు ముందెక్కి తాతకు దగ్గరగా బెడ్డింగు నడుముకు చేర్చుకొని అడ్డంగావున్న చెక్కను అని, కూర్చున్నాడు. వరలక్ష్మి చివరన కూర్చుని, ఇనప ఊచని ఆనుకొని ప్రయాణీకుల సందడిని తిలకిస్తోంది. తాత కూడా బండెక్కాడు. గేటు తీసి వున్నదని, బండినికోర్టుల వైపు పోనిచ్చాడు. రైలుబండి ఆలస్యమైనందుకు విసుక్కుంటూ, నీరసించిన ముఖంతో ప్రకృతి సౌందర్యాన్ని పరిశీలిస్తూ, గోదావరి చల్లనిగాలి కెగురుతూ వున్న ముంగురుల్ని సర్దుకుంటోంది వరలక్ష్మి. బండి నెమ్మదిగా నడుస్తోంది. ఎ. ఆర్. పి. స్టేషను దాటింది. పోలయ్య తాత బండి నాపి చుట్ట వెలిగించాడు.

"తాతా! బండికి లాంతరుందా? కిర్సనాయిలు పోయించావా? అని అడిగాడు భీమరాజు."

"ఏం! బాబు. ఇంకా పొద్దుంది కదాండి."

"ఏంలేదు వల్లూర్యా పేట రోడ్డు పక్కన చింతచెట్టు గుబురులో చీకటిగా వుంటుందని వచ్చేటప్పుడు నీళ్ళ..." అని ఆగాడు భీమరాజు.

"ఉందండి బాబు లేకపోతే మున్సిపాల్టీలు, పోలీసోళ్లు బతకనిత్తారా. రోజూ కేసులే పెడతారు. పావలా, బేడా వడికేత్తంటారు" అని సమాధానం చెప్పాడు.

పోలయ్యకు కిర్సనాయిలు మాటనగానే, పోయిన కిర్సనాయిలు రేషను కొర్డు తిరిగి సంపాదించటానికి తాను పడిన శ్రమ గుర్తుకొచ్చింది ఒక్కసారి ఆహ్లాదంగా నవ్వుకున్నాడు తలపాగలో అగ్గిపెట్టి పెడతూ.

"ఏం తాతా నవ్వుతున్నావ్." అని ప్రశ్నించాడు ఏమీ తోచని భీమరాజు తాతతో బాతాఖానీ వేద్దామని

"చెప్పమంటారా."

"చెప్పు."

పోలయ్య తాత చెప్పడం ప్రారంభించాడు. భీమరాజు శ్రద్ధగా వింటున్నాడు.

"ఇది జరిగి ఏడాదవుద్ది లేండి. మీరు లాంతర్లో కిర్సనాలుందాం టేను నాకో సంగతి గాపకం వొచ్చింది. కిర్సనాలు రేషను జోరుగా వున్నప్పుడు మా చిన్నది ఓసారి కొడ్డెక్కడో పారేసింది. మళ్ళీ ఆ కొడ్డు తెచ్చుకోడానికి ఎంతైనా కష్టంపడ్డా ననుకోండి. కొర్డు పడి పోయినాక కిర్సనాలుకోసం ఆ కోమటాయన కొట్టుకాడి కెల్లాను. కొడ్డు మా పిల్లెక్కడో పారేసిందని చెప్పాను. తాలూకాఫీస్కెళ్ళి కొత్త కొర్డు తెచ్చుకో పోలయ్యా అనిఅన్నాడాయన ఆ మూడో రోజున తీరిక సేసుకొని తాలూకాఫీస్కెల్లాను. అక్కడ సానామందున్నారు. కిర్సనాలు కొడ్డు పోయిందిబాబు కొడ్డెవరిత్తారు బాబిక్కడ నడిగితే, ఒక్కబాబు సమాధానం చెప్పలేదు. గుమ్మంకాడున్న జవాన్నడిగాను. "తాసిల్దారుగారు కొడ్డు యిత్తారు. ముందు అదేంటో సెలానా అంట అది రాయించి ఒక శేడ బాంకులోకట్టి, ఆ రశీదు తెమ్మ" న్నాడు. నాకేం అద్దమవలేదు. రొంబడికే ఒక బాబు

అడిగాను కిర్సనాలు కొడ్డుకోసం సెలావా అంట రసిపెట్టండని. "కాయితం తెమ్మంకో రాసి పెడతాను తాతా" అన్నాడా బాబు పాపం. నాకు కాయితం ఎవరిస్తారు. కోర్టు సెంటర్ దగ్గర కెల్లి అక్కడ ఆఫీసులో ఓబాబు నడిగి కాయితం తెచ్చియిచ్చాను. ఆబాబు కాయితం రాసియిచ్చాడు. దాఖలుచేద్దామంటే టైమైపోయిందన్నారు. ఇంటిక్కి తిరిగొచ్చి బండికట్టుకున్నాను. ఆరోజలా గడిసిపోయింది. మళ్లీ యెంబడినే మరుసటిరోజుని పరుగెత్తాను పొద్దున్నే అంటే పది గంట అవద్దులెండి. సెలావా దాఖలుసేశాను. ముద్రేసి ఒంటిగంటకి జవాను సెలావా తెచ్చి బేడ యిమ్మన్నాడు. మాటాడకుండా యిచ్చాను. ఏం చెయ్యమంటావు యీ కాయితం తీసికెల్లి అనడిగాను. కాయిదా కోర్టకాడున్న బాంకులో బేడ కట్టమన్నాడు మరి నీకిచ్చిన బేడో అని అడిగాను "నా మామూలన్నా"డు. నోరెత్తకుండా వచ్చాను. ఎండనబడి కాళ్లీడ్చుకుంటూ నెమ్మదిగా సేరాను బాంకుకాడికి మెట్లు లెక్కాను మేడమీదికి. గేటు అప్పుడే ఏసేసారంట. లోపల్లకెల్లనీయలేదు. ఏం బాబనడిగితే టైమైపోందని సెప్పారు నాయెనకాల ఉన్నోల్లంతా. సచ్చినో అంటూ ఇంటిక్కి తిరిగొచ్చాను. ఎండని బడివచ్చానేమో ఇంకాపూటకి బండి కట్టలేకపోయాను బాబయ్యా" అని చెప్పుతూ ఆరిపోయిన చుట్టను వెలిగించి, చెప్పడం ప్రారంభించాడు. భీమరాజు విసుగులేకుండా అతనిలోవుండే అమాయకత్వానికి సానుభూతి చూపుతున్నట్లుగా శ్రద్ధగా వింటున్నాడు. అడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా నడుస్తోంది ముసలి ఎద్దు.

"ఆ మరుసటిరోజు ఆదివారం అని ఎల్లలేదు. సోమారం పదిగంటలకే యెల్లాను. అక్కడ వరసలో నిలబడ్డాను. పని తొందరగానే అయిపోయింది. పన్నెండు గంటలకల్లా రసీదిచ్చేరు. ఇంటిక్కెల్లి కొంచం ఎంగిలిపడి బజారులో ఏమైన బేరంవుంటదని బండేసుకొని వచ్చాను. మీలాంటి బాబొకాయన తాలూకాపీస్కి తీసికెల్లమంటే తీసికెల్లాను. ఆ బాబు అరడాలు యిచ్చాడండి"

"మరి నీకు కొడుకులెవరూ లేరేమిటి? అని ప్రశ్నించాడు భీమరాజు"

"లేకేమండి, మా పెద్దోడు కాకినాడలో ఉంటున్నాడు. రెండోవోడుకూడా అక్కడనే వుంటున్నాడు. ఇక్కడ నేను, ముసలిది, మా సిన్నది, పడేల్లుంటాయిలెండి, ఉంటున్నాం. అన్నింటిక్కీ నేనే సావాలి బాబూ. ఏం సెయ్యమంటారు సెప్పండి" అని పోలయ్య తాత మళ్లీ చెప్పడం మొదలెట్టాడు.

"గంగరాయి సెట్టుకాడ బండాపుసేసి, ఆ రశీదిచ్చి కొడ్డు తెచ్చుకోడానికి ఆఫీస్కెల్లాను. జవానుకి రసీదిచ్చాను. ఆ కాయితాన్ని జవాను పట్టుకెళ్ళి ఓ గుమాస్తా కిచ్చాడు. నా దగ్గరకొచ్చి "తాసిల్దారుగారు లేరియ్యాల, రేపురా" అని జవానొచ్చి సెప్పాడు. మరుసటిరోజెల్లాను మద్దాన్నం ఎంగిలి పడి కూకుని, కూకుని ఇసుపొచ్చి నీరెండవేల కొచ్చాను. తాసిల్దారుగారు వచ్చారంట కాని నా కొడ్డుమీద సంతకం పెట్టలేదంట అని ఆ జవానొచ్చి సెప్పాడండి. నాలాంటోణ్ణి ఇలా బాధ పెట్టకండని కచ్చితంగా ఎప్పుడు రమ్మంటావు బాబని అడిగేద్దామని గుమస్తా దగ్గిరకెలితే, ఆ గుమస్తా ముందునన్ను బయటుండి మాటాడమన్నాడండి. ఏం సెప్పినా ఇనిపించుకోందే. "రేపు రావయ్యా" అని బంట్రోతు నన్ను బయటిక్కి గెంటేశాడు. తాత మాటలు విని వరలక్ష్మి తనలో తాను నవ్వుకుంటూవుంది. భీమరాజు మళ్ళీ [illegible] తిరిగించాడు.

"ఏం సెయ్యమంటారు. నెత్తిమీద సేతులేసుక్కూ నొచ్చాను. ఆ పూటత్తమాను బండి కట్టలేదండి. రెండురోజులు పోయి నాక యెల్లాను. జవాను కొడ్డు సేత్తో తెచ్చి పావలా యిమ్మన్నాడు. ఎందుకనడిగాను. మామూలన్నాడు. బేడ తీసుకొమ్మన్నాను. ఇనిపించుకోందే. ఏం సేయను బాబూ! పావలా పడేశాను. కొడ్డు చేతికొచ్చింది ఇన్నాల్లూ శేరు అద్దరూపాయిచ్చి కొన్నానండి కిర్సనాయిలు" అని కథ ముగించాడు పోలయ్య తాత.

"ఎవడడిగితే వాడికే పావలా, బేడా చేతికిచ్చావు..." అని భీమరాజు మాటలు పూర్తికాకుండానే "ఏం సచ్చేది బాబూ!

నానా తిప్పలు పెట్టారు. అధికార్లతో సెప్తే యింకేమైనా ఉందా, అసలే పని జరగదు." ఇలా ఉంటవండి" అని పోలయ్య తాత ఒక నిట్టూర్పు విడిచాడు.

"రిక్షావోల్లకి, ఒంటెద్దు బళ్ళోల్లకి, గుర్రబ్బళ్ళోల్లకి, మునిసిపాల్టీ బంట్రోతోల్లకి, పోలీసోల్లకి యీ మామూల్లివ్వడం ఒక మామూలైపోయిందండి బాబు. లేకపోతే యీ పోలీసోల్లు తమానం కేసులే పెడుతూ ఉంటారు. యీల్లంతా మా నెత్తురు తాగేత్తున్నారు బాబూ" అన్నాడు పోలయ్య తాత నిస్పృహతో.

"ఎలా ఐతేనేం మొత్తానికి కొద్ది సంపాదించావంటావు."

"సిత్తం. పేద కొద్దుకోసం ఆరణాలు మామూలు కింద, అయిదు రోజులు బత్తెం పోయింది."

"నీకు రోజూ ఏమాత్రం డబ్బు వస్తుంది?"

"ఓరోజున నాలుగు, ఓరోజున రెండు, మూడు రూపాయలు."

"మీకు ఏమీ తోచడం లేదేమిటి? నడుపు బండిని తొందరగా" లేని అధికారాన్ని తెచ్చుకుంటూ అంది వరలక్ష్మి పోలయ్య తాతతో. వరలక్ష్మి అజ్ఞానుసారం తాత ఎద్దు తుంటిపై కొరడాతో ఒకదెబ్బ తగిలించాడు బండి చురుకుగా ప్రయాణం సాగిస్తోంది.

"తాతా! నే నొకమాట చెప్తాను విను. రాజరికం బాగా వుండాలంటే దానికి సంబంధించిన పెద్ద ఉద్యోగస్తులు, చిన్న ఉద్యోగస్తులు అంతా నీతిగా పని చేయాలి. ప్రతిమనిషికీ జీవితానికి అవసరమైనవి, చిన్నవైనా పెద్దవైనా సంపాదించడానికి బీదవాడికైనా, భాగ్యవంతుడికైనా అందుబాటులో వుండే సౌకర్యాలు కలిగిననాడు ఆ రాజరికం మంచిదనిపించుకుంటుంది ఏమంటావ్"

"సిత్తం సిత్తం నాలాంటి అమాయకుణ్ణి చూసి మరీ ఏడిపిత్తారండి బాబూ."

"కాదు గడుసువాళ్ళకూడా గత్యంతరం లేదు తాతా. ఆ సౌకర్యాలు లేకపోవడం చేతనేగా యీమధ్య వోట్లు వేయడంలో మీరంతా తగిన సమాధానం చెప్పారు"

పోలయ్య తాత ఒక్కసారిగా బిగ్గరగా నవ్వాడు తనేదో ఘనకార్యం సాధించినట్టుగా.

"కాని, బాబూ! మల్లా అదే వచ్చిందంట రాజరికానికి"

"మొత్తానికి అసహాయ శూరుడిలా వున్నావే"

"మీలాంటి బాబుల్ని అడిగి తెలుసుకుంటూ వుంటానండి" అని పోలయ్య తాత అని ఎద్దుని మరోకదెబ్బ తగిలించాడు. బండి మల్లయ్యపేట దాటి కాతేరు ఊళ్ళో ప్రవేశించింది. ఎలా పోనియ్యమంటారని అడిగాడు పోలయ్య. ఆ ఎదురుగా కనిపించే కోమటి దుకాణం ప్రక్కన ఎత్తరుగుల పెంకుటింటిదగ్గరకు పోనిమ్మన్నాడు భీమరాజు. సతీసమేతుడై భీమరాజు బండిదిగి. సామానంతా నడవలో పెట్టించి, తాతకు మరో పావలా యెక్కువిచ్చి,

"చీకటిగా వుంది జాగ్రత్తగా వెళ్లు తాతా" అని లోపలకెళ్ళాడు. పోలయ్య తాత మరో చుట్ట వెలిగించి బండిని తిరుగుముఖం పట్టించాడు.

దేనినయినా మూఢంగా నమ్మే మనిషితో వాదించడం నీడతో కుస్తీ పట్టడం వంటిది. కుస్తీ పట్టేవాడు కొంతసేపటికి అలసిపోతాడు. నీడమాత్రం చివరకి యథాప్రకారంగా నిలిచిపోతుంది.—ఛార్లెస్ మైల్డ్ మే.

** ** ** **

మూఢనమ్మకాలగురించి జాగ్రతగా వుండడం అవసరం. ఎలకలవలె అవి మన మనస్సు అనే బోనులోకి ప్రవేశిస్తాయి. వచ్చిచేరిన తర్వాత ఇక బయటికి పోవడానికి వాటికి అవకాశం ఉండదు.—టైరోన్ ఎడ్వర్డ్స్.